క్లుప్తంగా

రక్తదానం.. ప్రాణదానం



యువకులను అభినందిస్తున్న పోలీసు అధికారులు

కొత్తూరు: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తూరు పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణానికి చెందిన పలువురు యువకులు హైదరాబాద్‌లో రక్తదానం చేశారు. ఆపదలో ఉన్న వారికి ఆయా ఆస్పత్రుల్లో ఉచితంగా రక్తదానం చేయడానికి తాము ఎల్లప్పుడూ ముందుంటామని యువకులు పేర్కొన్నారు. రక్తదానం చేసిన యువకులను పోలీసు అధికారులు అభినందించారు. కార్యక్రమంలో యువకులు మహిపాల్, ఆంజనేయులు, యాదగిరి, శివ, సాయి, గణేశ్, ఫాతీమా ఐటీఐ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు గ్రూప్‌-1 పరీక్షలు ప్రశాంతం



జేబీఆర్‌ఈసీ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని ఆయా ఇంజినీరింగ్ కళాశాలల్లో రెండోరోజు గ్రూప్‌-1 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని మండల రెవెన్యూ అధికారి గౌతమ్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో రెండోరోజు 984 మందికి 602 మంది, అమ్డాపూర్ చౌరస్తాలోని జోగినపల్లి బీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 816 అభ్యర్థులకు గాను 464 మంది గ్రూప్‌-1 పరీక్షలు రాశారని తెలిపారు. రెండోరోజు పరీక్షలు సజావుగా కొనసాగాయని తెలిపారు.

రైతుభరోసా వెంటనే అందించాలి

నందిగామ: రైతుభరోసాను ప్రభుత్వం వెంటనే అందించాలని నర్సప్పగూడ తాజా మాజీ సర్పంచ్ గోవిందు అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన నందిగామలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా కూడా ఇంతవరకు రైతులకు చేసింది శూన్యమేనని ఆరోపించారు. గత బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ రైతులకు ప్రతి పంటకు పెట్టుబడి కోసం సకాలంలో రైతుబంధు అందజేశారని గుర్తుచేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని, అదేవిధంగా ఇప్పటివరకు రుణమాఫీ కాలేని రైతులకు రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని సీపీఎం మండల కమిటీ నాయకుడు పల్లపు విఘ్నేష్ పేర్కొన్నారు. మండలంలోని కప్పపహాడ్ గ్రామానికి చెందిన పగిల్ల వెంకటేశ్, జంగిలి దాసు, జంగిలి అనితలకు వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సింహారెడ్డి సహకారంతో వెంకటేశ్‌కు రూ.51వేలు, జంగిలి దాసుకు రూ.15,500, అనితకు రూ.18వేలు మంజూరైన చెక్కులను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ కార్యదర్శి జంగిలి ప్రభుదాసు, శాఖ కార్యదర్శులు రాజశేఖర్, సీహెచ్ సురేష్, గుడాల భిక్షపతి, మాజీ వార్డు సభ్యులు ఇందిర, గోపి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

కాంగ్రెస్ నాయకురాలు విజయరెడ్డి



మాట్లాడుతున్న విజయరెడ్డి

మాడ్గుల: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు విజయరెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మూసీ పునరుజ్జీవనానికి చర్యలు చేపడుతుంటే అసత్య ఆరోపణలు చేస్తు బీఆర్‌ఎస్ నాయకులు పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. మంగళవారం మాడ్గులలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనను చూసి ఓర్వలేకే బీఆర్‌ఎస్ దుష్ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనతో నష్టపోయే ప్రతి కుటుంబానికి ప్రభుత్వం తగిన పరిహారం అందించి ఆదుకుంటుందన్నారు.

క్రీడా ప్రాంగణాలు.. నిరుపయోగం



నిరుపయోగంగా ముర్తుజాగూడ క్రీడాప్రాంగణం



మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ క్రీడా ప్రాంగణంలో చెత్తడంప్‌లు

- వసతులు, పరికరాల ఏర్పాటులో నిర్లక్ష్యం
- గ్రామీణ క్రీడాకారులకు అందని ప్రోత్సాహం
- లక్షల రూపాయల ప్రజాధనం వృథా
- పట్టించుకోని సంబంధిత అధికారులు

మొయినాబాద్‌రూరల్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. ఉపాధి హామీ పథకం కింద లక్షల రూపాయల ఖర్చు చేసి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. కానీ వాటిలో సరైన వసతులు కల్పించకపోవడంతో ప్రాంగణాలు ఎందుకు పనికి రాకుండాపోయాయి. మరికొన్ని మైదానాలు ఊరికి దూరంగా ఏర్పాటు చేయడంతో క్రీడాకారులు వాటివైపు ఇప్పటివరకు కన్నెత్తి చూడని పరిస్థితి ఉంది. ప్రస్తుతం కొన్ని చోట్ల క్రీడా ప్రాంగణాలకు నిర్వహణ లేకపోవడంతో చెట్లు, గడ్డి పెరగడంతో పాటు ఆయా క్రీడా ప్రాంగణాల్లో జీవనోపాధికి వచ్చిన కొందరు గుడిసెలు వేసుకొని ఉంటున్నారు.

మండలంలో క్రీడాప్రాంగణాలు ఇలా..

మండలంలో 28 గ్రామ పంచాయతీలకుగాను 17 గ్రామాల్లో క్రీడా మైదానాల ఏర్పాటుకు స్థలాలను గుర్తించి వాటికి కేటాయించారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్, ఎన్కెపల్లి, చిలుకూరు, మెడిపల్లి, తోల్‌కట్ట, కనకమామిడి, పెద్దమంగళారం, అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ, అమ్డాపూర్, బాకారం జాగీరు, ముర్తుజాగూడ, మొయినాబాద్, సురంగల్, శ్రీరామ్‌నగర్, ఎత్‌మార్‌పల్లి గ్రామాల్లో అధికారులు ప్రభుత్వ స్థలాలను గుర్తించి మైదానాలను ఏర్పాటు చేశారు.

రెండు గ్రామాల్లో అభివృద్ధి పనులు

మండల పరిధిలోని ముర్తుజాగూడ, నాగిరెడ్డిగూడ గ్రామాల్లో రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అప్పట్లో క్రీడా మైదానాలను ప్రారంభించారు. ఆ తర్వాత మిగతా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలకు పెద్దఎత్తున కమాన్‌లు, కట్ అవుట్‌లు ఏర్పాటు చేసి వదిలిపెట్టారు. హిమాయత్‌నగర్‌లో క్రీడా ప్రాంగణం స్థలానికి అప్పట్లో ప్రభుత్వ నిధులు ఖర్చు చేసి కమాన్‌ను ఏర్పాటు చేశారు. ఇది హైదరాబాద్-బెంగళూర్ జాతీయ రహదారి పక్కనే ఉండడంతో అసైన్‌మెంట్ స్థలం కావడం మూలానా కోర్టులో కేసు ఉన్నా బోర్డును ఏర్పాటు చేసి వదిలేశారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు వృథా..

మైదానాల అభివృద్ధికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి దాదాపు నాలుగు లక్షల నిధులు ఖర్చు పెట్టడానికి అవకాశం కల్పించారు. మైదానం నిర్వహణకు ఒకరిని నియమించి క్రీడాప్రాంగణం చుట్టూ 300ల మొక్కలు నాటాలని లక్ష్యం నిర్దేశించారు. మొక్కలను సంరక్షించేందుకు ఒక ఉద్యోగిని ఏర్పాటు చేసి ఉపాధి పథకం ద్వారా వారికి వేతనం ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ ప్రాంగణాలకు ఉద్యోగిని నియమించకపోవడంతో పాటు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం వృథా కావడం, క్రీడాకారులకు ఆటస్థలాలు అందుబాటులోకి రాకపోవడం బాధాకరంగా ఉందని ఆయా గ్రామాల్లోని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బోర్డులకే పరిమితం

మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు నిరుపయోగంగా మారాయి. చాలాచోట్ల ప్రాంగణాలను గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేయడంతో ఆ స్థలాలు వ్యర్థాలకు నిలయంగా మారాయి. కొన్నిచోట్ల బోర్డులు ఏర్పాటు చేసి నిర్వహణ అధికారిని ఏర్పాటు చేయకపోవడంతో బోర్డులకే పరిమితమయ్యాయి.

వినియోగంలోకి తీసుకురావాలి



లక్షలు వెచ్చించి గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను అధికారులు వినియోగంలోకి తీసుకురావాలి. వాటి నిర్వహణతో పాటు ప్రజలు, యువకులకు ప్రాంగణాల ఆవశ్యకతపై అవగాహన కల్పించాలి.
– దిలీప్, హిమాయత్‌నగర్, క్రీడాకారుడు

గ్రామ పంచాయతీలకు అప్పగించాం



మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల నిర్వహణ ఆయా గ్రామ పంచాయతీ అధికారులకు అప్పగించాం. గ్రామ పంచాయతీల వారే నిర్వహణను చూసుకోవాలి. ప్రభుత్వం ద్వారా అప్పట్లో అందజేసిన క్రీడా సామగ్రి(కేసీఆర్ కిట్)ని ఆయా గ్రామాల అధికారులకు అందజేశాం.
– సంధ్య, ఎంపీడీఓ, మొయినాబాద్

పశుపోషణలో జాగ్రత్తలు తప్పనిసరి



మొయినాబాద్: చిలుకూరులో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి అహ్మద్

మండల పశువైద్యాధికారి అహ్మద్

మొయినాబాద్: పాడి రైతులు పశువుల పోషణలో తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి అహ్మద్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరులో ఆయన మంగళవారం పాడి పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తుగా నివారణ టీకాలు ఇప్పించాలన్నారు. ప్రభుత్వం ద్వారా గ్రామాల్లోని పాడి పశువులకు ఉచితంగా టీకాలు వేస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిలుకూరులో 152 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పద్మ, ప్రసన్నకుమార్, భీంరావ్ గోరేమియా, గోపాల మిత్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాశీంబౌలిలో..

మొయినాబాద్‌రూరల్: పాడి రైతులు పశువులకు తప్పనిసరిగా గాలికుంటు టీకాలు వేయించాలని అమ్డాపూర్ పశువైద్య అధికారి దేవిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కాశీంబౌలి గ్రామంలో ఆయన సిబ్బందితో కలిసి పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువులకు గాలికుంటు నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. పశువులకు ఎలాంటి సమస్యలు వచ్చిన వెంటనే తెలియజేసి పశువులకు చికిత్స చేయించుకోవాలని సూచించారు. అధికారుల సూచనలు పాటిస్తూ పాడి పశువులతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏ శివకుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌రూరల్: కాశీంబౌలిలో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ దేవిరెడ్డి

డిమాండ్ల సాధనకు పోరాటం



మాట్లాడుతున్న ఆకాశ్‌చారి

ఏఐఎస్‌ఎఫ్ షాద్‌నగర్ ఇంచార్జ్ ఆకాశ్‌చారి

షాద్‌నగర్: విద్యారంగంలో నెలకొన్న సమస్యల సాధనకు తాము నిరంతరం పోరాటం చేస్తామని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్‌ఎఫ్) షాద్‌నగర్ ఇన్‌చార్జి ఆకాశ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించారన్నారు. గత పాలకుల హయాంలో విద్యావ్యవస్థ అంతా గాడితప్పిందని విమర్శించారు. మార్పు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో మెరుగైన సదుపాయాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకు బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు విజయ్‌చారి, నరేశ్‌రాథోడ్, రమేశ్, గణేశ్, తరుణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో భారీ వర్షం



మొయినాబాద్‌లో కురుస్తున్న వర్షం

మొయినాబాద్: మొయినాబాద్‌లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3 గంటల వరకు విపరీతమైన ఎండ, ఆ తర్వాత ఒక్కసారిగా నల్లమబ్బులు కమ్మేసి వర్షం మొదలైంది. మొయినాబాద్‌తో పాటు చిలుకూరు, పెద్దమంగళారం, సురంగల్, ముర్తుజాగూడ, హిమాయత్‌నగర్, ఎనికేపల్లి, అమ్డాపూర్ తదితర గ్రామాల్లో భారీగా వర్షం పడింది. సుమారు గంటపాటు వర్షం పడడంతో రోడ్లపై నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వరిచేళ్లు తయారవుతున్న సమయంలో వర్షం పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నియామకం



నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాస్

కేశంపేట: మండల పరిధిలోని కాకునూర్ గ్రామానికి చెందిన సొంటి శ్రీనివాస్‌ను బీఎస్పీ షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ మంగళవారం శ్రీనివాస్‌కు నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీఎస్పీని గ్రామాల్లోకి తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో షాద్‌నగర్‌లో విజయఢంకా మోగిస్తామన్నారు. ఇంటింటికీ పార్టీ సిద్ధాంతాలను వివరిస్తామన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేందర్, కార్యదర్శి జగన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అబ్రహం లింకన్, పల్లాటి రాములు, రమేశ్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ఆమనగల్లు: పట్టణానికి చెందిన జంతుక యాదయ్య ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఎంపికై ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించాడు. ఈ నేపథ్యంలో నూతన ఉపాధ్యాయుడిని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఒగ్గు మహేశ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు బాలరాజు, శ్రీశైలం, కృష్ణ, అశోక్, మహేశ్, గిరి, కృష్ణ, మల్లేశ్, శేఖర్, శంకర్, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేయాలంటూ నిరసన

చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్, కమిషనర్ జోక్యంతో సద్దుమణిగిన గొడవ



నిరసన చేస్తున్న వారితో మాట్లాడుతున్న వైస్‌చైర్మన్ వెంకట్రామిరెడ్డి

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని సింగాపురం (1, 9, 10వార్డులు)కు వెళ్లే ప్రధాన రహదారి పనులను నిలిపివేయడంతో ఆ వార్డుల ప్రజలు మంగళవారం పెద్దఎత్తున నిరసన చేపట్టారు. సింగాపురం గేట్ నుంచి శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టి, కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగాపురంకు వెళ్లే ప్రధాన రహదారిని 24ఫీట్ల వెడల్పు, మధ్యలో 3 ఫీట్లతో డివైడర్ వచ్చేలా అధికారులు పనులు ప్రారంభించారు. కాగా సగం పనులు పూర్తయినా తర్వాత రోడ్డు పక్కనే ఉన్న వెంచర్ వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ ప్రహరీ నుంచి రోడ్డు మధ్య భాగానికి 25ఫీట్ల మేర వెడల్పు ఉంటుందని, ప్రస్తుతం పనులు అలా జరగడం లేదని మున్సిపల్ కమిషనర్‌కి ఫిర్యాదు చేయగా.. అధికారులు పనులను నిలిపివేశారు. ఆగ్రహించిన సింగాపురం వాసులు మంగళవారం నిరసనకు దిగగా వెంటనే వైస్‌చైర్మన్ వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్ శ్రీనాథ్ జోక్యం చేసుకొని చైర్‌పర్సన్, కమిషనర్ ఇరువురితో మాట్లాడి పనులను మళ్లీ ప్రారంభించేలా చొరవ తీసుకున్నారు. భవిష్యత్‌లో వెంచర్ ప్రహరీకి ఎటువంటి ఇబ్బంది రాకుండా చూస్తామని అందరూ నిర్ణయించడంతో గొడవ సద్దుమణిగింది. నిరసన తెలిపిన వారిలో 1వ వార్డు కౌన్సిలర్ సంతోష్, సింగాపురం వాసులు శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి, దేవయ్య, శ్రీకాంత్‌రెడ్డి, నర్సింలు, సంజీవ, వెంకట్రామిరెడ్డి, నరహరి, రవిప్రకాశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బీజేపీతోనే అన్నివర్గాలకు న్యాయం



సభ్యత్వ నమోదులో పాల్గొన్న విష్ణువర్ధన్‌రెడ్డి

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

కేశంపేట: బీజేపీ అధికారంలో ఉంటేనే రాష్ట్రంలో సబ్బండవర్గాలకు న్యాయం జరుగుతుందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బీజేపీ అధ్వర్యంలో మహా సభ్యత్వ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని సంగెం, ఎక్లాస్‌ఖాన్‌పేట, మంగళిగూడ, అల్వాల, కొత్తపేట, కొనాయపల్లి, సంతాపూర్, చౌలపల్లి గ్రామాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు రఘురాంగౌడ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆయా గ్రామాల్లో విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొని పలువురికి సభ్యత్వ నమోదును అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో బూత్‌స్థాయిలో అత్యధికంగా సభ్యత్వ నమోదు చేయించి, రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలన్నారు. కేంద్రంలో పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కష్టపడి పని చేసిన ప్రతీ కార్యకర్తను పార్టీ గుర్తించి తగిన పదవులను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సభ్యత్వ సహ ప్రముఖ్‌లు కర్రేడ్ల నరేందర్‌రెడ్డి, కుమ్మరి మహేశ్, నాయకులు రావుల యాదయ్య, విఠల్‌గౌడ్, కుమార్, కోటి, వెంకటేశ్వర్, నర్సింలు, రాకేశ్, శ్రీను, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'చలో ఖమ్మం' విజయవంతం చేయండి

గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌నాయక్

షాద్‌నగర్: గిరిజన సమ్మేళనాన్ని పురస్కరించుకొని వచ్చే నెల 5న చలో ఖమ్మం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌నాయక్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయ ఆవరణలో ఆ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఈశ్వర్ నాయక్ మాట్లాడుతూ.. గిరిజన సంఘం వ్యవస్థాపకుడు గుగులోత్ ధర్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా వచ్చే నెల 5, 6వ తేదీల్లో ఖమ్మంలో గిరిజన సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుగులోత్ ధర్మ రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు సాధించిన ప్రజానాయకుడన్నారు. మైదాన ప్రాంత గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకు ఆయన ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ప్రస్తుతం గిరిజనులపై దాడులు పెరిగిపోతున్న నేపథ్యంలో ధర్మ స్ఫూర్తితో రాబోవు రోజుల్లో మరిన్ని ఉద్యమాలు చేపడతామన్నారు. ఖమ్మంలో నిర్వహిస్తున్న సమ్మేళనం కార్యక్రమానికి గిరిజనులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనునాయక్, హీరునాయక్, రాజునాయక్, దీప్లానాయక్, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టిన ఉపాధ్యాయులు

తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి తపస్ ఆధ్వర్యంలో మంగళవారం షాద్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలను ధరించి ధర్మాగ్రహ దీక్షతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు డీఏలు, పీఆర్సీలు రావడం లేదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు మార్పును కోరుకొని కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. ఈ ప్రజాపాలన ప్రభుత్వంలోనైనా మా కష్టాలు తీరుతాయని ఆశించిన ఉపాధ్యాయులు ప్రభుత్వ వైఖరితో నిరాశకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏలు, పీఆర్సీలను తక్షణమే అమలు చేయడంతో పాటు హెల్త్‌కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, సురేశ్‌కుమార్‌గౌడ్, పెంటన్న, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చాంపియన్‌షిప్‌ను విజయవంతం చేయండి



కరాటే పోటీల కరపత్రాన్ని హీరో సుమన్‌కు అందజేస్తున్న మాస్టర్ రాజశేఖర్

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్ర మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ కరాటే పోటీలను విజయవంతం చేయాలని మార్షల్ ఆర్ట్స్ ఫౌండర్ చీఫ్ ఆర్గనైజర్ జోగు రాజశేఖర్ తెలిపారు. నవంబర్ 10వ తేదీన నిర్వహించబోయే కరాటే పోటీల కరపత్రాన్ని సినీ నటుడు, కరాటే మాస్టర్ సుమన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ పోటీలను బొంగ్లూర్ గేటు సమీపంలోని అంతార రిసార్ట్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ సుమన్, సుదర్శన్, నర్సింహాచారి హాజరు కానున్నారని తెలిపారు. కావున విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ పోటీలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.